# త్వరలో 'ఒకే రాష్ట్రం-ఒకే ఆర్ఆర్బీ'

**వెల్లడించిన కేంద్ర ఆర్థిక శాఖ**

న్యూఢిల్లీ: త్వరలోనే 'ఒకే రాష్ట్రం–ఒకే ఆర్ఆర్బీ' విధానాన్ని కేంద్ర ఆర్థిక శాఖ అమలు చేయనుంది. సమర్థ నిర్వహణ, ఖర్చుల హేతుబద్ధీకరణ, 43 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు (ఆర్ఆర్బీ)ల ఏకీకరణ కోసం ఈ ప్రణాళిక అమలు చేయనున్నట్టు తెలిపింది. ఏకీకరణకు సంబంధించి చాలావరకు పని పూర్తయ్యిందని, దీనికి సంబంధించి నాలుగో విడత కార్యాచరణ త్వరలోనే చేపట్టనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు, యూపీలో 3, బీహార్, గుజరాత్, జమ్ముకశ్మీర్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్‌లలో రెండేసి చొప్పున ఆర్ఆర్బీలు ఉన్నాయి. ఆర్థిక శాఖ రోడ్‌మ్యాప్ ప్రకారం వీటిలో 15 ఆర్ఆర్బీలను విలీనం చేస్తారు. ఇక తెలంగాణ విషయానికొస్తే ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ), తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మధ్య రాష్ట్ర విభజనకు సంబంధించిన ఆస్తులు, అప్పుల వివాదం ముగిసిందని అధికారులు చెప్పారు. ప్రస్తుతం ఆర్ఆర్బీల్లో 50 శాతం వాటా రిజర్వ్ బ్యాంక్ కలిగి ఉండగా, 35% సంబంధిత స్పాన్సర్డ్ బ్యాంక్‌లు, 15 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు కలిగి ఉన్నాయి.

# కారుణ్య మరణానికి అనుమతివ్వండి

- మా అమ్మను ఆఫీసులో లైంగికంగా వేధిస్తున్నారు
- పోలీసులకు, ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యల్లేవు
- వారణాసి జిల్లా జైలు సూపరింటెండెంట్‌పై రాష్ట్రపతి ముర్ముకి డిప్యూటీ జైలర్ కూతురు లేఖ
- ప్రధాని మోదీ సొంత నియోజకవర్గంలో దళిత మహిళకు భద్రత కరువు






వారణాసి: ప్రధాని మోదీ సొంత నియోజకవర్గం వారణాసిలో మహిళలకు భద్రత కరువవుతున్నది. డిప్యూటీ జైలర్ అయిన తన తల్లిని ఆమె సీనియర్లు వేధిస్తున్నారని ఆమె కూతురు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆదివారం లేఖ రాశారు. ఆ వేధింపులను తమ కుటుంబం తట్టుకోలేకపోతున్నదని.. తామంతా చనిపోయేందుకు అనుమతి ఇవ్వాలని ఆమె కోరారు. 'అధికారంలో ఉన్న వారికి వ్యతిరేకంగా పోరాడితే, మన అంతం తప్పదన్న విషయం నాకు తెలుసు. అందుకే నా జీవితాన్ని ముగించడానికి మీ అనుమతి కోరుతున్నా' అని బాధితురాలు మీనా కనోజియా కూతురు నేహా సింగ్ తన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. వారణాసి జిల్లా జైల్ సూపరింటెండెంట్ ఉమేశ్ కుమార్ సింగ్‌పై స్థానిక పోలీస్ స్టేషన్‌లో గత నెలలో తాను ఫిర్యాదు చేశానని నేహా పేర్కొన్నారు. తన తల్లిది ఎస్సీ కులమని.. ఆమెను ఉమేశ్ శారీరకంగా, మానసికంగా హింసించారని, కులం పేరుతో దూషించారని ఆమె ఆరోపించారు. తన తల్లికి ఆయన అసభ్య సైగలు చేసి, ఇంటికి రమ్మని పిలిచారని చెప్పారు. అతడిపై ఎన్ని ఆరోపణలు వచ్చినా.. ప్రతిసారి అతడికి జైలు ప్రధాన కార్యాలయం నుంచి క్లీన్‌చిట్ లభిస్తున్నదని వెల్లడించారు. 'ఇటీవల ఉమేశ్ సింగ్ సన్నిహిత సహాయకుడు అశ్వని పాండే జైలు ఆఫీసులా కనిపిస్తున్న చోట ఒక మహిళను దుస్తులు విప్పమని బలవంతం చేస్తున్న దృశ్యాలున్న వీడియోలు బయటకొచ్చాయి. అయితే అవి జైల్లోని దృశ్యాలు కావని అధికారులు పేర్కొంటున్నారు' అని నేహా తెలిపారు. ఉమేశ్ సింగ్‌ను సస్పెండ్ చేయకపోతే అతడు తమ కుటుంబం మొత్తాన్ని అంతం చేస్తాడని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

# ట్రంప్.. హ్యాండ్సాఫ్!

**ట్రంప్, మస్క్ విధానాలపై ప్రజాగ్రహం ▪ అమెరికా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు ▪ అధ్యక్షుడిని అభిశంసించాలని డిమాండ్**

వాషింగ్టన్, ఏప్రిల్ 6: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రభుత్వ సలహాదారు, డోజ్ అధిపతి ఎలాన్ మస్క్ విధానాలకు వ్యతిరేకంగా అమెరికన్లు గర్జించారు. 'హ్యాండ్సాఫ్' పేరుతో పెద్ద ఎత్తున ఉద్యమానికి దిగారు. దేశంలోని 50 రాష్ర్టాల్లో దాదాపు 1400 చోట్ల భారీ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. దాదాపు మూడు నెలల కిందట అమెరికా అధ్యక్షుడిగా మరోసారి బాధ్యతలు స్వీకరించిన ట్రంప్.. స్వల్ప సమయంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపారు. ప్రభుత్వ ఉద్యోగులకు కోత పెట్టారు. ప్రపంచ దేశాలతో వాణిజ్య యుద్ధానికి తెరలేపారు. ఈ క్రమంలో ట్రంప్ దుందుడుకు నిర్ణయాలను నిరసిస్తూ ప్రజలు ఆందోళనకు దిగారు. 2017లో మహిళల నిరసన, 2020లో బ్లాక్ లైవ్స్ మ్యాటర్స్ ఆందోళనల తర్వాత ఇంత పెద్దయెత్తున నిరసనలు జరగడం ఇదే తొలిసారి.

**ఇవీ డిమాండ్లు..**

దేశవ్యాప్తంగా స్టేట్ క్యాపిటల్స్, ఫెడరల్ బిల్డింగ్స్, కాంగ్రెసెనల్ ఆఫీసులు, సోషల్ సెక్యూరిటీ హెడ్‌క్వార్టర్లు, పార్కులు తదితర చోట్ల ప్రజలు ఆందోళన చేపట్టారు. బిలియనీర్ల పెత్తనానికి చెక్ పెట్టాలని, ప్రభుత్వంలో అవినీతికి ముగింపు పలకాలని, మెడిక్‌ఎయిడ్, సామాజిక భద్రత పథకాలకు నిధుల కోతను ఆపాలని, వలసదారులు, ట్రాన్స్‌జెండర్లు, ఇతర కమ్యూనిటీలపై దాడులను ఆపాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. అలాగే ట్రంప్ టారిఫ్ వార్‌పైనా వారు మండిపడ్డారు. పెంగ్విన్లపై కాదు, సంపన్నులపై పన్నులు వేయండి అంటూ ఎద్దేవా చేశారు. మనుషులు నివసించని, పెంగ్విన్లు జీవించే ఆస్ట్రేలియా దీవిపై ట్రంప్ ఇటీవల పన్ను విధించిన సంగతి తెలిసిందే.



ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా మిన్నెసోటాలో పౌరుల భారీ నిరసన ప్రదర్శన

**ఇంపీచ్ ట్రంప్.. డిపోర్ట్ మస్క్..**

ప్రభుత్వ ఉద్యోగులు, సామాజిక భద్రతా పథకాలకు కోత పెట్టడంపై సియాటిల్ నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ట్రంప్‌ను అభిశంసించాలి.. మస్క్‌ను బహిష్కరించాలి' అన్న ప్లకార్డులను అట్లాంటాలో ఆందోళనకారులు ప్రదర్శించారు. బోస్టన్‌లో 'హ్యాండ్సాఫ్ అవర్ డెమొక్రసీ', 'హ్యాండ్సాఫ్ అవర్ సోషల్ సెక్యూరిటీ' అని రాసి ఉన్న ప్లకార్డులను చేతబట్టి ట్రంప్‌నకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినదించారు. ప్రభుత్వంలో మస్క్ జోక్యంపైనా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'డిపోర్ట్ ఎలాన్ మస్క్', 'ట్యాక్స్ ద రిచ్.. నాట్ ద పెంగ్విన్స్' అన్న ప్లకార్డులు పలు చోట్ల కనిపించాయి.

**150కి పైగా సంఘాల ఆధ్వర్యంలో**

లేబర్ యూనియన్లు, ఎల్‌జీబీటీక్యూ కార్యకర్తలు, న్యాయవాదులు, వయోజనులు, వృద్ధులు, ఎలక్షన్స్ యాక్టివిస్టులు సహా 150కి పైగా గ్రూపులు ఈ 'హ్యాండ్సాఫ్' ఆందోళనను నిర్వహించాయి. అయితే దేశవ్యాప్తంగా ఈ ర్యాలీలు శాంతియుతంగానే జరిగాయని, ఎలాంటి అరెస్టులు చోటుచేసుకోలేదని అధికార వర్గాలు తెలిపాయి. ఈ దేశవ్యాప్త నిరసనలపై శ్వేత సౌధం ఒక ప్రకటన విడుదల చేసింది. 'ట్రంప్ వైఖరి స్పష్టంగా ఉంది. అర్హత కలిగిన లబ్ధిదారులకు సామాజిక భద్రత, మెడికేర్, మెడికెయిడ్‌ను అందించడానికి ఆయన కట్టుబడి ఉన్నారు. ఇంతకాలం డెమోక్రాట్ల పాలనలో వాటి ద్వారా చాలామంది అక్రమార్కులు లబ్ధి పొందారు' అని పేర్కొంది.



# అమెరికాలో వరదల బీభత్సం

**16 మంది దుర్మరణం.. లోతట్టు ప్రాంతాలు జలమయం**

టెక్సాస్: అమెరికాలో భారీ వర్షాలు, వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. తుఫాన్ ప్రారంభమైనప్పటి నుంచి 16 మంది ప్రాణాలు కోల్పోయారు. టెన్నెస్సీలోనే 10 మంది మరణించారు. శనివారం కురిసిన భారీ వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నదులు ఉప్పొంగి ప్రవహించడం కొనసాగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. వివిధ రాష్ర్టాల్లో భవనాలు, వంతెనలు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు వరదల్లో చిక్కుకునే అవకాశం ఉందని నేషనల్ వెదర్ సర్వీస్ తెలిపింది. లూయిస్‌విల్లే, కెంటకీ, మెంఫిస్‌లలో వాణిజ్య సరఫరాలకు అంతరాయాలు ఏర్పడొచ్చని వెల్లడించింది.


**కుక్కలా మోకాళ్లపై నడిపించి..**

# నాలుకతో నాణేలు తీయించి

- టార్గెట్లు పూర్తిచేయని ఉద్యోగులపై కేరళలోని కంపెనీ దారుణం
- దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం



కొచ్చి, ఏప్రిల్ 6: లక్ష్యాలు పూర్తి చేయలేదని పేర్కొంటూ మెడలో పట్టీవేసి కుక్క మాదిరిగా ఉద్యోగులను నడిపించడమే కాక, నేలపై నాణేలను నోటితో తీయించిన అమానుష ఘటన కేరళలో వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించిన వీడియో ఒకటి బయటకు రాగా, పెరుంబవూర్‌లో ఓ మార్కెటింగ్ కంపెనీ ఈ దారుణానికి పాల్పడినట్టు వెల్లడైంది. అయితే అలాంటి శిక్షలు ఉన్నాయని కొందరు నిర్భయంగా వెల్లడించగా, మరికొందరు లేవని పేర్కొనడం గమనార్హం. పనితీరు బాగా లేని ఉద్యోగులను శిక్షించడానికి తమ కంపెనీ వారిని కుక్కలా నడిపించడం, నేలపైన నాణేలను నోటితో తీయించడం లాంటి అవమానకర, అమానుష పద్ధతులను ప్రయోగిస్తున్నదని కొంతమంది ఉద్యోగులు ఆరోపించారు. ఈ ఘటనపై రాష్ట్ర కార్మిక శాఖ దర్యాప్తు చేపట్టింది.



**బాల రాముడి నుదుటిపై సూర్య తిలకం**

అయోధ్య: శ్రీరామ జన్మభూమి అయోధ్యలోని బాల రాముడి నుదుటిపై సూర్య తిలకం శోభాయమానంగా ప్రకాశించింది. శ్రీరాముడు జన్మించిన పర్వదినం శ్రీరామ నవమి సందర్భంగా సూర్య కిరణాలు నేరుగా ఆయన నుదుటిని తాకాయి. ఆదివారం మధ్యాహ్నం కచ్చితంగా 12 గంటలకు ఈ దృశ్యం భక్తులకు కనువిందు చేసింది. దీంతో భక్తులంతా భక్తిపారవశ్యంలో ఓలలాడారు. దివ్యానుభూతికి లోనయ్యారు. శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా దేశవ్యాప్తంగా భక్తులు భజనలు, రామ నామ జపాలు, రామాయణ పారాయణలు చేశారు.

**భారత్ సహా 14 దేశాల**

# వీసాలు రద్దు

**సౌదీ అరేబియా నిర్ణయం**

న్యూఢిల్లీ: ఉమ్రా, బిజినెస్, ఫ్యామిలీ విజిట్ వీసాల జారీపై సౌదీ అరేబియా తాత్కాలిక నిషేధం విధించింది. సరైన రిజిస్ట్రేషన్ లేకుండా హజ్ యాత్ర చేయడానికి జరిగే ప్రయత్నాలను నిరోధించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. చాలా దేశాల నుంచి ఇటువంటి వీసాలపై వచ్చి, గడువు ముగిసినప్పటికీ సౌదీ అరేబియాలోనే ఉంటూ, అధికారిక ధ్రువీకరణ లేకుండా హజ్‌లో పాల్గొంటున్నారని అధికారులు తెలిపారు. ఈ తాత్కాలిక నిషేధం భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ సహా 14 దేశాల నుంచి వచ్చేవారికి వర్తిస్తుందని చెప్పారు. హజ్ యాత్ర సజావుగా, సురక్షితంగా నిర్వహించేందుకు వీసాల జారీపై కఠిన నిబంధనలను అమలు చేస్తున్నట్టు తెలిపింది.



**సీపీఎం ప్రధాన కార్యదర్శిగా ఎంఏ బేబీ**

**కేరళ మాజీ మంత్రికి సారథ్య బాధ్యతలు**

మదురై: సీపీఎం ప్రధాన కార్యదర్శిగా కేరళ మాజీ మంత్రి ఎంఏ బేబీ ఎన్నికయ్యారు. ఈ పదవికి పార్టీ నాయకులలో ఒక వర్గం అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) అధ్యక్షుడు అశోక్ దవాలేకు మద్దతు ఇచ్చారు. అయితే ఆదివారం జరిగిన పార్టీ 24వ సభలో ఎంఏ బేబీ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. కేరళలోని ప్రక్కులంలో 1954లో జన్మించిన బేబీ.. కేరళ స్టూడెంట్ ఫెడరేషన్‌లో చేరికతో తొలిసారిగా రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఆయన కొల్లాంలోని ఎస్ఎన్ కాలేజీలో బ్యాచ్‌లర్ డిగ్రీలో చేరినా దానిని పూర్తి చేయలేదు. 1986 నుంచి 1998 వరకు రాజ్యసభ సభ్యునిగా వ్యవహరించారు. కేరళలోని కుండ్రాలో 2006 నుంచి 2016 వరకు ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహించారు.

# సీఎం పీఠం ఇస్తేనే..!

- కేపీసీసీ అధ్యక్ష పదవి వీడేది
- అధిష్ఠానానికి తేల్చిచెప్పిన డీకే
- స్థానిక సంస్థల ఎన్నికల వరకు నాయకత్వ మార్పు లేనట్టే
- సిద్ధరామయ్య, మంత్రులకు చెప్పిన ఏఐసీసీ పెద్దలు



బెంగళూరు, ఏప్రిల్ 6: కర్ణాటక కాంగ్రెస్‌లో మరో వివాదం రాజుకుంది. కర్ణాటక పీసీసీ అధ్యక్ష పదవిని వీడేందుకు డీకే శివకుమార్ ససేమిరా అన్నట్టు తెలుస్తున్నది. ఈ మేరకు కాంగ్రెస్ అధిష్ఠానానికి ఆయన తేల్చిచెప్పినట్టు సమాచారం. రెండు రోజుల ఢిల్లీ పర్యటన తర్వాత ఆయన బెంగళూరుకు తిరిగి వచ్చారు. ఢిల్లీ పర్యటనలో శివకుమార్‌తో పాటు సీఎం సిద్ధరామయ్య ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ పెద్దలను కలిసినట్టు తెలుస్తున్నది. ఈ సందర్భంగా తనకు సీఎం పీఠం విషయంలో స్పష్టమైన హామీ ఇచ్చేవరకు కేపీసీసీ అధ్యక్ష పదవిని వీడేది లేదని అధిష్ఠానానికి డీకే స్పష్టం చేసినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఈ ఏడాది చివర్లో జరగనున్న జిల్లా పరిషత్, తాలూకా పంచాయతీల ఎన్నికలు ముగిసే వరకు కేపీసీసీ నాయకత్వ మార్పు లేనట్టేనని సీఎం సిద్ధరామయ్యకు, అతని వర్గం మంత్రులకు ఏఐసీసీ పెద్దలు తెలియజేసినట్టు పార్టీ వర్గాల సమాచారం. కేపీసీసీ అధ్యక్షుడిగా డీకేకు పొడిగింపు ఇవ్వనున్నట్టు పరోక్షంగా సిద్ధరామయ్య, మంత్రులకు ఢిల్లీ పెద్దలు సంకేతాలు ఇచ్చినట్టు తెలిసింది.

**డీకేకు చెక్ పెట్టేందుకు..**

డీకేను కేపీసీసీ పదవి నుంచి తప్పించాలని పలువురు మంత్రులు కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నారు. సీఎం పీఠానికి పోటీగా మారిన డీకేకు చెక్ పెట్టేందుకు సిద్ధరామయ్య వారికి పరోక్షంగా మద్దతు తెలుపుతున్నట్టు సమాచారం. సిద్ధరామయ్యకు సన్నిహితుడైన మంత్రి కేఎన్ రాజన్న 'ఒక వ్యక్తి–ఒక పదవి' అనే పార్టీ విధానాన్ని ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు. అయితే, హనీట్రాప్ వివాదంలో చిక్కుకోవడంతో రాజన్న ఈ మధ్య కాస్త వెనక్కి తగ్గినట్టు తెలుస్తున్నది. ఈ పదవిని ఆశిస్తున్న మంత్రి సతీశ్ జార్కిహోళి కూడా బాహాటంగా మీడియాతో కేపీసీసీ అధ్యక్ష మార్పు గురించి మాట్లాడుతున్నారు. అయితే, కేపీసీసీ అధ్యక్ష పదవిని వదులుకునేందుకు డీకే సుముఖంగా లేరని తెలుస్తున్నది. మొదటి నుంచి తాను ఆశిస్తున్న సీఎం పీఠం దక్కక, ఉన్న పదవి కూడా ఊడిపోతే పార్టీలో, ప్రభుత్వంలో తన పరపతి తగ్గిపోతుందని ఆయన భావిస్తున్నట్టు పార్టీ వర్గాల సమాచారం.

# పాంబన్ బ్రిడ్జి ప్రారంభం

**జాతికి అంకితం చేసిన ప్రధాని**

**సీఎం స్టాలిన్ గైర్హాజరు**



రామేశ్వరం, ఏప్రిల్ 6: తమిళనాడులోని మండపం నుంచి రామేశ్వరం ద్వీపాన్ని కలిపే పాంబన్ సముద్ర వంతెనను ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా రామేశ్వరం–తాంబరం రైలు, ఆ బ్రిడ్జి కింద నుంచి వెళ్లే కోస్ట్‌గార్డ్ నౌకను కూడా ప్రధాని ప్రారంభించారు. ఈ కార్యక్రమాలకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గైర్హాజరయ్యారు. కాగా, రూ.550 కోట్లతో 2.09 కిలోమీటర్ల పొడవున సముద్రంపై నిర్మించిన ఈ బ్రిడ్జి దేశంలోనే తొలి వర్టికల్ సీ లిఫ్ట్ వంతెన.

**సంతకమైనా తమిళంలో పెట్టండి**

రాష్ట్రంలో 8,300 కోట్లకు పైగా ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ తమిళ మాధ్యమంలో వైద్యవిద్యను అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ర్టానికి చెందిన కొంతమంది నేతలు పంపే లేఖలలో వారి సంతకాలు తమిళంలో ఉండని విషయాన్ని గుర్తించినట్టు ఆయన ఎవరి పేరును ప్రస్తావించకుండా పేర్కొన్నారు. కనీసం మీ సంతకాలైనా తమిళంలో పెట్టండని ఆయన కోరారు.

**డీలిమిటేషన్‌పై తమిళ ప్రజల భయాన్ని తొలగించాలి**

పార్లమెంట్ నియోజకవర్గాలు పునర్విభజన ప్రక్రియపై తమిళనాడు ప్రజలకు ఉన్న భయాన్ని ప్రధాని మోదీ తొలగించాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కోరారు. తమిళనాడు హక్కులకు భంగం కలిగించమని మోదీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ఒక తీర్మానాన్ని ఆమోదించాలని ఆయన కోరారు. ఉదగమండంలోని పలు అభివృద్ధి పనులు, పథకాలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. డీలిమిటేషన్ గురించి అడిగే హక్కు తమకు ఉందని ఆయన అన్నారు.



## చింపాంజీలూ ఇంజినీర్లే!

న్యూఢిల్లీ: మనిషి తర్వాత తెలివైన జీవులుగా భావిస్తున్న చింపాంజీలు.. ఇంజినీరింగ్, ఫిజిక్స్ నాలెడ్జ్‌ను సంపాదించాయని తాజా అధ్యయనం వెల్లడించింది. చింపాంజీలు నిత్య జీవితంలో ఇంజినీర్లలా వ్యవహరిస్తాయని, సాధనాలను ఎంచుకోవటంలో, తయారు చేసుకోవటంలో 'ఫిజిక్స్' వాడుతున్నాయని అధ్యయనంలో తేలింది. వివిధ వర్సిటీలకు చెందిన శాస్త్రవేత్తల బృందం.. చింపాజీలపై జరిపిన అధ్యయనంలో సరికొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. టాంజానియాలోని గోంబే స్ట్రీమ్ జాతీయ పార్క్‌లోని చింపాంజీల జీవనశైలిని శాస్త్రవేత్తల బృందం దగ్గర్నుంచి విశ్లేషించి ఈ నివేదికను విడుదల చేసింది. 'అడవి చింపాంజీలు చెద పురుగుల వేట కోసం నిర్దిష్ట యాంత్రిక లక్షణాలున్న సాధనాలను ఎంచుకుంటున్నాయి' అని పరిశోధకుడు అలెగ్జాండ్రియా పాస్కల్ చెప్పారు. అత్యంత ప్రయోజనంగా ఉండే వాటిని సాధనాలుగా మలుచుకుంటున్నాయని, నిర్దిష్ట లక్షణాలున్న పదార్థాలను మాత్రమే ఎంచుకుంటున్నాయని నివేదిక పేర్కొన్నది.




## మూడేండ్లలో 80% పెరిగిన స్కూల్ ఫీజులు

న్యూఢిల్లీ: మన దేశంలోని ప్రైవేట్ స్కూళ్లు గత మూడేండ్లలో ఫీజులను దాదాపుగా రెట్టింపు చేశాయని శుక్రవారం విడుదలైన లోకల్ సర్కిల్ సర్వే వెల్లడించింది. 309 జిల్లాల్లో 31 వేల మంది తల్లిదండ్రుల నుంచి సేకరించిన వివరాల ప్రకారం 2022–2025 మధ్య ప్రైవేట్ స్కూళ్ల ఫీజులు 80 శాతం పెరిగాయని 8 శాతం మంది అభిప్రాయపడ్డారు. 50–80 శాతం పెరిగాయని 36 శాతం మంది చెప్పారు. 30–50 శాతం పెంపుదల కనిపించిందని 8 శాతం మంది, 10–30 శాతం పెంచారని 27 శాతం మంది చెప్పారు. కేవలం 8 శాతం మంది మాత్రమే తమ పిల్లల ఫీజుల్లో ఎలాంటి పెరుగుదల లేదని పేర్కొన్నారు. ప్రైవేట్ స్కూళ్ల ఫీజులను నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు నిస్సహాయంగా ఉన్నాయని అనేక మంది తల్లిదండ్రులు వాపోయారు. ఈ విషయమై 16 వేల మందిని ప్రశ్నించగా.. కేవలం 7 శాతం మంది మాత్రమే ప్రభుత్వాలు సరైన చర్యలు తీసుకుంటున్నాయని అభిప్రాయపడ్డారు.



## వారానికి 90 గంటలు పని చేయాలి

న్యూఢిల్లీ: మన దేశ స్టార్టప్ కంపెనీల పని సంస్కృతి, విలువల గురించి జరుగుతున్న చర్చలోకి ఆర్‌పీజీ గ్రూప్ చైర్మన్ హర్ష్ గోయెంకా అడుగు పెట్టారు. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయెల్, 'ఇన్ఫోసిస్' ఎన్ఆర్ నారాయణ మూర్తి అభిప్రాయాలతో ఏకీభవించారు. గోయెంకా శనివారం ఎక్స్‌లో స్పందిస్తూ.. ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి, పీయూష్ గోయెల్ మాటలను యథాతథంగా అర్థం చేసుకోకూడదని చెప్పారు. చైనా లేదా అమెరికాతో భారత దేశం పోటీపడాలనుకుంటే కేవలం సదుపాయం, సానుకూలత, బ్రాండ్స్ మీద మాత్రమే దృష్టి పెట్టడం సరిపోదని తెలిపారు. ఉన్నత స్థాయికి చేరుకోవాలనే బలమైన కోరికతో పని చేయాలన్నారు. కృత్రిమ మేధ (ఏఐ), డీప్ టెక్, రోబోటిక్స్, క్లీన్ ఎనర్జీ వంటి రంగాలు ప్రత్యేకతను, ప్రభావాన్ని చూపుతాయని వివరించారు. ఎస్ఎన్ సుబ్రహ్మణ్యం వారానికి 90 గంటలు పని చేయాలని చెప్పినపుడు గోయెంకా అందుకు విరుద్ధంగా స్పందించారు.




## బ్యాంకు ఖాతాదారుల్లో 39% మహిళలు

న్యూఢిల్లీ: మన దేశంలోని బ్యాంకు ఖాతాదారుల్లో 39.2 శాతం మంది మహిళలే. గ్రామీణ ప్రాంతాల్లో 42.2 శాతం మహిళా బ్యాంకు ఖాతాదారులు ఉన్నారు. మొత్తం డిపాజిట్లలో 39.7 శాతం డిపాజిట్లు మహిళలవే. గత కొన్నేళ్లుగా డీమ్యాట్ అకౌంట్లు కూడా పెరుగుతున్నాయి. అంటే స్టాక్ మార్కెట్‌లో భాగస్వామ్యం పెరుగుతున్నదన్నమాట. 2021 మార్చి 31 నుంచి 2024 నవంబరు 30నాటికి డీమ్యాట్ అకౌంట్ల సంఖ్య 3.32 కోట్ల నుంచి 14.30 కోట్లకు పెరిగింది. అంటే నాలుగు రెట్లు కన్నా ఎక్కువ పెరుగుదల నమోదైంది. కేంద్ర ప్రభుత్వ గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వ శాఖ ఈ వివరాలను వెల్లడించింది. 'విమెన్ అండ్ మెన్ ఇన్ ఇండియా, 2024: సెలెక్టెడ్ ఇండికేటర్స్ అండ్ డేటా' శీర్షికతో ఈ వివరాలను ప్రచురించింది. జనాభా, విద్య, ఆరోగ్యం, ఆర్థిక భాగస్వామ్యం, నిర్ణయీకరణ వంటి ముఖ్యమైన అంశాలపై ఈ నివేదికను రూపొందించింది.



## సుదర్శన్ పట్నాయక్‌కు యూకే శాండ్ మాస్టర్ అవార్డ్

లండన్: ప్రపంచ ప్రఖ్యాత సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఇసుకతో శిల్ప కళను ప్రదర్శించటంలో ఆయన చేసిన కృషికి గాను 'ద ఫ్రెడ్ డారింగ్టన్ శాండ్ మాస్టర్ అవార్డ్'ను అందుకున్నారు. శనివారం నైరుతి ఇంగ్లండ్‌లోని వేమౌత్‌లో మొదలైన 2025 ఇంటర్నేషనల్ శాండ్ ఆర్ట్ ఫెస్టివల్‌లో సుదర్శన్ పట్నాయక్‌కు నగర మేయర్ జాన్ ఓరెల్ మెడల్, అవార్డును అందజేశారు. దీనికంటే ముందు వేడుకలో పాల్గొన్న సుదర్శన్ పట్నాయక్ 'ప్రపంచ శాంతి' అనే సందేశంతో 10 అడుగుల ఎత్తుతో వినాయకుడి సైకత శిల్పాన్ని ఆవిష్కరించారు. ప్రపంచ ప్రఖ్యాత బ్రిటీష్ సైకత శిల్పి ఫ్రెడ్ డారింగ్టన్ పేరుమీదుగా బ్రిటన్ ఏటా ఈ పురస్కారాలను అందజేస్తున్నది. ఈ పురస్కారాన్ని అందుకున్న తొలి భారతీయ కళాకారుడిగా సుదర్శన్ పట్నాయక్ రికార్డ్ సృష్టించారు. ఈసారి బ్రిటన్‌లో జరిగిన స్యాండ్ ఫెస్టివల్‌లో అంతర్జాతీయంగా ప్రఖ్యాతి పొందిన 65మంది సైకత శిల్ప కళాకారులు పాల్గొన్నారు.



## ఆన్‌లైన్ గేమ్‌లో చెంపదెబ్బలు.. గేమింగ్ కంపెనీపై దావా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: ఆన్‌లైన్ గేమ్‌లో జరిగిన ఘటనలు సైతం నిజంగానే తనకు జరిగినట్టు భావించాడు చైనాకు చెందిన ఒక వ్యక్తి. గేమ్‌లో వేలసార్లు చెంపదెబ్బలు తిని అవమానాన్ని ఎదుర్కొన్నానని పేర్కొంటూ ఒక వ్యక్తి గేమింగ్ కంపెనీపై కేసు దాఖలు చేశాడు. 'థ్రీ కింగ్‌డమ్స్ కిల్' అనే ఆన్‌లైన్ గేమ్‌కు 15 సంవత్సరాలుగా అభిమాని అయిన ఆ వ్యక్తి ఆటలో భాగంగా తాను 4,800 సార్లకు పైగా చెంపదెబ్బలు తిన్నానని, అది తనను అవమానానికి గురి చేయడమే కాక, ఆత్మాభిమానాన్ని దెబ్బతీసిందని తెలిపాడు. కియాబెన్ అనే మారుపేరును వాడే ఆ వ్యక్తి ఆటలో ఉత్తమ ర్యాంక్‌ను కలిగి ఉన్నాడని జిన్ హువాంగే అనే సంస్థ తెలిపింది. ఆన్‌లైన్ ఆటలో విజయం సాధించిన ప్రతిసారి తన ప్రత్యర్థులు గుడ్లు, గడ్డి, పాదరక్షలు లాంటివి తన అవతార్‌పై విసరడాన్ని కియాబెన్ గమనించాడు. ఆ చర్యలు తనను చెంపదెబ్బ కొట్టిన బాధను కలిగించాయని ఆయన పేర్కొన్నాడు.

## భూమిపై గిరిజనుల హక్కులు నిరాకరణ!

న్యూఢిల్లీ: దేశంలో చాలా మంది గిరిజనులకు అడవుల మీద ఉన్న హక్కులను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే నిరాకరిస్తున్నాయని అధికారిక గణాంకాలు వెల్లడించాయి. ఈ ఏడాది జనవరి 31 వరకు దేశవ్యాప్తంగా అటవీ హక్కుల చట్టం కింద అడవులపై తమ హక్కులను గుర్తించాలని 51 లక్షలకు పైగా దరఖాస్తులు దాఖలు కాగా వాటిలో మూడింట ఒక వంతు తిరస్కరణకు గురి కావడమే ఇందుకు నిదర్శనం. అత్యధిక దరఖాస్తులు వచ్చిన రాష్ర్టాల్లో ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర మొదటి అయిదు స్థానాల్లో ఉన్నాయని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ తెలిపింది. 4 లక్షల దరఖాస్తుల తిరస్కరణతో గిరిజనుల హక్కులు నిరాకరించిన రాష్ర్టాల జాబితాలో ఛత్తీస్‌గఢ్ అగ్రస్థానంలో ఉంది. అడవుల్లో నివసిస్తున్న గిరిజనులకు అక్కడి భూములపై హక్కులు ఉన్నాయని అటవీ హక్కుల చట్టం–2006 గుర్తిస్తున్నది.